క్లుప్తంగా

ఎండిపోయిన చెట్లను తొలగించాలి



మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇస్సిపేటలో బస్సులు ఆగే ప్రదేశానికి సమీపంలో ఉన్న ఎండిపోయిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. పూర్తిగా ఎండిపోయిన చెట్లు ఎప్పుడు కూలుతాయోనని ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. బస్సుల కోసం వేచిఉండే సమయంలో కూలితే ప్రమాదం జరుగుతుందని, వెంటనే తొలగించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బియ్యం అందజేత



చిట్యాల: నిట్ ప్రొఫెసర్ కూనిశెట్టి సుబ్బారావు కోడలు ఉషారాణి జన్మదినం సందర్భంగా సుబ్బారావు అందించిన బియ్యం, నిత్యావసరాలు అందించారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మ్యాదరి సునీల్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని జూకల్‌లో ఈ బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు సంతోష్‌లక్ష్మి, విద్యానికేతన్ ప్రధానోపాధ్యాయులు తరాల జనార్దన్ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కాటారం: కాటారం మండలం దేవరాంపల్లిలో పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కాటారం, కొండంపేట, మహదేవపూర్ గ్రామాలకు చెందిన ఆరుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి రూ.20,040, 4 సెల్‌ఫోన్లు స్వాధీనంచేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి నగదు, సెల్‌ఫోన్‌లు సీజ్ చేసినట్లు వెల్లడించారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి జిల్లాకు వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతంను ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలకటి రాజయ్య ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. దళితబంధులో గ్రౌండింగ్ చేసిన నిధులను వెంటనే విడుదల చేయాలని, ఎస్సీ సంక్షేమానికి కేటాయించిన నిధులను దారి మళ్లించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా, భూపాలపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేణుకుంట్ల మహేష్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్, జిల్లా కార్యదర్శి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని మేడారం గ్రామానికి చెందిన మండపు లక్ష్మీరాజు నీట్ ఎంట్రెన్స్‌లో ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నాయకపోడు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీరాజు మంచిర్యాల జిల్లా రామగుండంలోని సింగరేణి మెడికల్ సైన్స్ కళాశాలలో సీటు సాధించడంతో బుధవారం మేడారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నాయకపోడు సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

హక్కు పత్రాలు ఇవ్వాలి

వెంకటాపురం(కె): ఆదివాసీల సాగులో ఉన్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ బుధవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ మాట్లాడుతూ.. బోధాపురం గ్రామంలో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు పత్రాలు ఇవ్వడంలో అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములకు అడ్డురావొద్దని కోరారు.

జోరుగా బియ్యం దందా

- టన్నులకొద్ది తరలుతున్న పీడీఎస్ బియ్యం
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- మామూళ్ల మత్తులో అధికారులు



పట్టుబడిన బియ్యం చూపుతున్న అధికారులు (ఫైల్)

మొగుళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ దందా అక్రమార్కులకు మూడు పువ్వులు.. ఆరు కాయల చందంగా మారింది. గ్రామాల్లోని ప్రజల వద్ద తక్కువ రేటుకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి వివిధ చోట్ల నిల్వ చేసి టన్నుల కొద్ది బియ్యాన్ని మహారాష్ట్ర వంటి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే లోపాయికారి ఒప్పందంతోనే ఈ బియ్యం దందా కొనసాగుతోందని తెలుస్తుంది. ఎక్కడో ఒక చోట బియ్యం పట్టుబడగా పోలీసులు నామమాత్రంగా కేసులు నమోదు చేసి సరైన చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ బియ్యం దందాకు అదుపు లేకుండా పోయింది. మండలంలోని ఆకినపల్లి, పిడిసిల్ల, ఇస్సిపేట, పర్లపల్లి, మొగుళ్లపల్లి తదితర గ్రామాల్లో నిల్వలను ఏర్పాటు చేసుకొని రాత్రి సమయాల్లో వేరే గ్రామాలకు తరలిస్తున్నట్లు సమాచారం. సోదాలు నిర్వహించి పలువురిపై కేసులు పెట్టినా పూర్తిస్థాయిలో అక్రమ దందాపై దృష్టి సారించకపోవడంతో అధికారులు, అక్రమార్కులకు మధ్య ఒప్పందం నిజమేనని అర్థమవుతుంది.

కమీషన్లతో రవాణా

బియ్యం దందా చేస్తున్న అక్రమార్కులు గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి అధికారులకు ముడుపులు చెల్లిస్తూ యథేచ్ఛగా వ్యవహారం నడుపుకుంటున్నారు. వాహనాల్లో పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న సమయంలో అధికారులకు ముందస్తు సమాచారం ఇస్తూనే ముడుపులు అందించి పక్క రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఇందులో మండలంలోని కొంత మంది రేషన్‌డీలర్లు కూడా ఉన్నట్లు సమాచారం. అధికారులు మామూలు మత్తులో అక్రమార్కులకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. అక్రమార్కులకు కళ్లెం వేయాల్సిన అధికారులే కొమ్ము కాస్తుంటే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బియ్యం దందాను అరికట్టాలి



అధికారులు, రేషన్‌డీలర్ల అండదండలతో మండలంలో అక్రమంగా రేషన్ బియ్యం దందా కొనసాగుతుంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి రేషన్ బియ్యం దందాను అరికట్టాలి.

– చర్లపల్లి వెంకటేశ్వర్లు, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు

నిషేధిత మత్తుపదార్థాలు విక్రయించొద్దు


- డీఎస్పీ సూర్యనారాయణ
- మెట్‌పల్లిలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం
- నంబర్‌ప్లేటు లేని వాహనాల సీజ్



మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ, తదితరులు

కాళేశ్వరం: గ్రామాల్లో నిషేధి మత్తుపదార్థాలు, గుడుంబా, గుట్కా, గంజాయి లాంటి మత్తుపదార్థాలు విక్రయించొద్దని కాటారం డీఎస్పీ సూర్యనారయణ అన్నారు. బుధవారం రాత్రి మహదేవపూర్ మండలం మెట్‌పల్లి(కన్నెపల్లి)లో కమ్యూనిటీ కాంటాక్ట్‌లో భాగంగా సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి తనిఖీలు చేపట్టారు. ఇందులో 21 వాహనాలు తనిఖీ చేసి 3 నంబర్ ప్లేటు లేని వాహనాలను సీజ్ చేశారు. మిగతా వాటికి జరిమానా విధించారు. గ్రామంలో పది లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నిషేధిత పదార్థాలను ఎవరైనా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, రాబోయే రోజుల్లో గ్రామ పంచాయతీ ఎలక్షన్లలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని అన్నారు. గ్రామానికి కొత్తవారు వస్తే తమకు సమాచారం అందించాలని, అలాగే ఊరి నుంచి ఎవరైనా ఇతర గ్రామాలకు వెళ్లిపోయిన సమాచారం తెలియజేయాలని తెలిపారు. ఊరిలో ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో కాళేశ్వరం ఎస్సై తమాషారెడ్డి, కాళేశ్వరం ఎస్సై-2 కె.భగవత్, మహాదేవపూర్, పలిమెల ఎస్సైలు పవన్, సాయిశశాంక్, రమేష్, టీజీఎస్పీ స్పెషల్ పార్టీ, సివిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


అన్నపూర్ణ అవతారంలో దుర్గామాత



మొగుళ్లపల్లి: అన్నపూర్ణ అవతారంలో దుర్గామాత..



కాళేశ్వరం: శ్రీశుభానందదేవి అమ్మవారు



కాళేశ్వరం: శ్రీసరస్వతి అమ్మవారు

మొగుళ్లపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శివరామకృష్ణ భజనమండలి సభ్యుల సేవా సహకారంతో మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో కొలువుదీరిన దుర్గామాత బుధవారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బండారి వేణు కుటుంబసభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వేణవంక నవీన్, ప్రసాద్, భజనమండలి సభ్యులు, అన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంలో..

కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధదేవాలయాలైన శ్రీశుభానందదేవి(పార్వతి), శ్రీసరస్వతి అమ్మవార్లు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు అన్నపూర్ణదేవిగా భక్తులు దర్శమిచ్చారు. బుధవారం అర్చకులు అమ్మవార్లను అన్నపూర్ణదేవిగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదం అందజేశారు. భజన కార్యక్రమాలు చేశారు. ఈఓ మహేష్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



మహాసభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

భూపాలపల్లి అర్బన్: రాష్ట్రంలోని జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర ఐటీ, శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇల్లందుక్లబ్‌లో బుధవారం నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) 3వ మహాసభకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిజం సమాజంలో గౌరవప్రదమైన వృత్తి అని, ప్రజాస్వామానికి నాలుగో స్తంభంగా జర్నలిజం పిలువ పడుతుందన్నారు. జర్నలిజం సమాజాన్ని మేలుకొలపాలని ఎమ్మెల్యే సత్యనారాయణరావు అన్నారు.

మార్పు కోసం కృషి

మార్పు తీసుకురావడానికి నిరంతరం కష్ట పడుతున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దళిత మేధావుల, మహాత్మా గాంధీ ఉపాధిహామీ పథకం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేష్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంలతో కలిసి మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దండు రమేష్‌ను సత్కరించారు. స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల ఆచరణలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సమావేశంలో రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, తెలంగాణ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్, తాటికొండ కృష్ణ, కార్యదర్శులు చంద్రశేఖర్, రఘు, భిక్షపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



బతుకమ్మలతో మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు

కాటారం: కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు పలు రకాల పూలు సేకరించి బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మలను ఒక దగ్గర చేర్చి ఆట పాటలతో కోలాట నృత్యాలు చేశారు. అనంతరం ఆయుధ పూజ కార్యక్రమం నిర్వహించారు. దుర్గామాతను కొలిచి కళాశాలలోని మెకానికల్, ఈసీయూ ఇంజనీరింగ్ ల్యాబ్‌లలో ప్రత్యేక పూజలు చేశారు. కళాశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాడుదాం



గ్రామ పంచాయతీ ఆవరణలో దివ్యాంగులు

గోవిందరావుపేట: దివ్యాంగులు, చేయూత పింఛన్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం పై ఒత్తిడి చేద్దామని వీహెచ్‌పీఎస్ ములుగు జిల్లా కార్యదర్శి నరాల సమ్మిరెడ్డి, ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు యనగందుల మొగిలి అన్నారు. దివ్యాంగులు, చేయూత పింఛన్ లబ్ధిదారుల సమస్యల పరిష్కారం కోసం చల్వాయి గ్రామ పంచాయతీ ఆవరణలో వీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు పెదబోయిన శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం చైతన్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమ్మిరెడ్డి, మొగిలి మాట్లాడారు. గ్రామస్థాయిలో పింఛన్‌దారులను చైతన్యవంతం చేసి, స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి హామీలు సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట మహాదీక్షలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం హామీల అమలులో విఫలమైతే తీవ్రమైన పరిణామాలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ ములుగు జిల్లా నాయకులు సామ కళింగరెడ్డి, వినుకొండ సదానందం, కొమ్మిడి మహేష్, చుక్క కొంరయ్య, పడిదల అరవింద్, ఎర్రం రాజుకుమార్, మల్లారెడ్డి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



రేగొండ: మాట్లాడుతున్న రమాదేవి



టేకుమట్ల: అంగన్‌వాడీలో పోషణ మాసోత్సవంలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు



సూరారంలో మాట్లాడుతున్న సీడీపీఓ రాధిక

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి

రేగొండ: పోషక విలువలు గల ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ టీచర్ తన పరిధిలోని బాలింతలు, గర్భిణులకు ఆరోగ్యకరమైన ఆహారం ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. పోషకలోపం లేని సమాజం నిర్మించడానికి కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మాలత, ప్రియాంక, సునీత, శ్యామల, రజిత, రమ, ఆశావర్కర్లు, గర్భిణులు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోషణ మాసోత్సవాలు

టేకుమట్ల: మండలంలోని వెలిశాల అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, సునీత ఆధ్వర్యంలో బుధవారం పోషణ మాసోత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎదిగే పిల్లలు ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా ఆకుకూరలను తీసుకోవాలన్నారు. రోడ్డు పక్కన విక్రయించే ఆహారపదార్థాలను తినొద్దని సూచించారు. ఇంట్లోనే తయారు చేసుకుని తినాలన్నారు. ఎక్కువగా చిరుధాన్యాలతో తయారు చేసిన తినుబండారాలను తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని తెలిపారు. రైతులు సైతం సేంద్రియ ఎరువులతో పంటలను పండిస్తే ఆరోగ్యకరమైన ఆహారం అందరికీ లభిస్తుందని అన్నారు. బాలికలు మొబైల్‌కు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ కనబర్చాలన్నారు. అనంతరం పోషణ మాసోత్సవాల ప్రతిజ్ఞ చేసి, పిల్లలకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించి, అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, ఏఎన్ఎం సంగీత, ఆశా కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, బాలింతలు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కాళేశ్వరం: గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీఓ రాధిక అన్నారు. బుధవారం పోషణ మాసంలో భాగంగా మహదేవపూర్ మండలం సూరారం అంగన్‌వాడీ సెంటర్‌లో సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడికల్ చెకప్ విధిగా చేసుకోవాలని, గర్భిణి సమయంలో ఆహారం బాగా తీసుకొని బరువు పెరగాలన్నారు. కార్యదర్శి అంజలి, టీచర్ అంజలి, చంద్రిక, శాంతి, లక్ష్మి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

- ఘనంగా ఎన్ఎస్ఎస్ డే



కళాశాలలో కేక్ కట్ చేస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రమేష్

కాళేశ్వరం: విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య అన్నారు. ఎన్ఎస్ఎస్ డేను పురస్కరించుకొని బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.రమేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడారు. పూలను పూజించే సంస్కృతి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేస్తుందని తెలిపారు. ఈ సంప్రదాయాలను కొనసాగిస్తూ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్స్ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, మానవత సేవ దృక్పథం అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు అబ్దుల్ గని, ప్రసాద్, సమ్మయ్య, సదాశివ్, సదానందం, సంధ్య, శ్రీనివాస్, మహేష్, సనత్ కుమార్, కర్ణ ప్రకాశ్, మహేందర్, శ్వేత, రమాదేవి, సిబ్బంది లక్ష్మణ్, రాజయ్య, శ్రీహరి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపు ధరల బోర్డులు ప్రదర్శించాలి

ములుగు రూరల్: తగ్గిన జీఎస్టీ ధరలను చూపే బోర్డులను షాపుల ఎదుట ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజాద్ పాషా అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులకు వ్యాపారులు బిల్లులు ఇవ్వాలని అన్నారు. జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ గ్యాస్‌ను తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల రాజు, కొమరయ్య, నటరాజ్, వెంట్రాప్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి



కుమారస్వామి (ఫైల్)

రేగొండ: మానసిక పరిస్థితి సరిగాలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లిగోరికి చెందిన సూదనబోయిన కుమారస్వామి (32) మానసిక పరిస్థితి బాగోలేక ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాలేదు. దీంతో సోమవారం పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు ములుగు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి, మెరుగైన చికిత్స కోసం వరంగల్‌లని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

అక్రమంగా గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కొత్తపల్లిగోరి ఎస్సై దివ్య బుధవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లిగోరి మండలం వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన అజ్మీరా జయపాల్, అజ్మీరా రజిత తమ చేను వద్ద అక్రమంగా గుడుంబా తయారు చేస్తూ, విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం దాడులు నిర్వహించారు. 9 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యోగస్తులందరికీ కరువు భత్యం ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్

భూపాలపల్లి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులందరికీ కరువు భత్యం ప్రకటించాలని మాదిగ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బొడ్డు దయాకర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం మాదిగ ఉద్యోగుల సమైక్య జిల్లా అధ్యక్షుడు హర్షం స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి దయాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లా కేంద్రంలో జాంబవ భవన నిర్మాణానికి మాదిగ ఉద్యోగస్తులందరూ ఆర్థిక సాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యం, పీఆర్‌సీని ప్రకటించాలన్నారు. వివిధ రకాల పెండింగ్ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మంజూరు చేస్తూ ఉద్యోగస్తులందరికీ మనోధైర్యం కల్పించాలన్నారు. నాయకులు రాజన్న, మంద రాజు, భద్రయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

కాటారం: మండలంలో ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు బుధవారం పరామర్శించారు. గుమ్మాళ్లపల్లిలో కొలుగూరి సమ్మయ్య, చింతకానిలో ఆకాష్, పార్వతమ్మ మృతి చెందగా ఆయా కుటుంబ సభ్యులను మధు ఓదార్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటయ్య, మొగిలి, నాగమణిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. నాయకులు జోడు శ్రీనివాస్, ఊర వెంకటేశ్వరరావు, గాలి సడువలి, పంతకాని సద్వలి, వంగల రాజేంద్రాచారి, ఉప్పు సంతోష్, రమణ, రవి, తదితరులు ఉన్నారు.

ప్రమాద బాధితుడికి..

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన నేరెళ్ల రామకృష్ణగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా బుధవారం ఆయనను మండల గౌడ సంఘం నాయకులు పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు బండి శ్రీనివాస్, పోశాల చందరమౌళి, పల్లెర్ల పోశాలు, పైడిపెల్లి కిరణ్, పోశాల నరేష్, కోల తిరుపతి, తదితరులు ఉన్నారు.

మలేరియా జ్వరాలపై ఆరా



వివరాలు తెలుసుకుంటున్న సునీల్‌కుమార్

వాజేడు: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జోనల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ కుమార్.. డెంగీ, మలేరియా జ్వరాలపై ఆరా తీశారు. స్థానిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించారు. జ్వరాల తీవ్రత ఎలా ఉంది. డెంగీ, మలేరియా జ్వరాల సంఖ్యపై తెలుసుకున్నాను. జ్వరాలు రాకుండా చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట దుర్గారావు, సతీష్ కుమార్, మురళి, వాజేడు వైద్యాధికారి మహేందర్ ఉన్నారు.